## క్లుప్తంగా

### చట్ట వ్యతిరేక పనులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్

**కొల్చారం(నర్సాపూర్):** రెస్ట్ రూంలు నిర్వహించే యజమానులు వాటిల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయల టీ జంక్షన్ సమీపంలో నిర్వహిస్తున్న రెస్ట్ రూంల యజమానులతో సమావేశమయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. రెస్ట్ రూంలకు వచ్చే వ్యక్తుల నుంచి తప్పనిసరి గుర్తింపు కార్డులు, మొబైల్ నెంబర్లు తీసుకోవడంతో పాటు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ రెస్ట్ రూంల వద్ద సీసీ వివరాలను ఏర్పాటు చేయాలన్నారు. రోజువారి నిర్వహణ వివరాలను పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

### మొలకెత్తిన ధాన్యం



మొలకెత్తిన ధాన్యం చూపిస్తున్న రైతు బాలు

**శివ్వంపేట(నర్సాపూర్):** మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి ధాన్యం మొలకెత్తింది. మండల కేంద్రం శివ్వంపేటకు చెందిన ముద్దగల బాలు తను పండించిన ధాన్యం కళ్లంలో అరబోసి బియ్యం పట్టిద్దామనుకొని కుప్ప చేసి కవర్ కప్పి అలాగే ఉంచాడు. మూడు రోజుల క్రితం శివ్వంపేటలో భారీ వర్షం కురవడంతో ధాన్యం తడిపోయింది. మరుసటి రోజు ధాన్యం అరబోసినప్పటికీ ధాన్యం తడిసి పోవడంతో మొలకెత్తినట్లు వాపోయారు. అప్పులు చేసి ఆరుగాలం పండించిన ధాన్యం అకాల వర్షం వల్ల నష్టపోవాల్సి వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

### సేవాలాల్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలి



పాపన్నపేటలో పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభిస్తున్న బంజారా నాయకులు

**పాపన్నపేట(మెదక్):** సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15న రోజున సెలవు దినం ప్రకటించాలని కోరుతూ పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభిస్తున్నట్లు బంజారా నాయకులు ఫూల్‌సింగ్, రాజు, రమేశ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పాపన్నపేటలో వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్లు కావస్తున్నా.. బంజారాల బతుకులు మారడం లేదన్నారు. దేశ జనాభాలో 15 కోట్ల మంది బంజారాలు ఉన్నారని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం, సమాజహితం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన సేవాలాల్ జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు పోస్ట్ కార్డులు రాస్తున్నట్లు చెప్పారు.

### పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**పాపన్నపేట(మెదక్):** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఈ నెల 17న ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న ధర్మ దీక్ష పోస్టర్‌ను బుధవారం తపస్ ఉపాధ్యాయ సంఘు నాయకులు విడుదల చేశారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, తపస్ మండలాధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, తులసీ రాం, శ్రీహరి, రవికాంత్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

### ఎల్ఈడీ లైట్ల అందజేత

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల పరిధిలోని కొంతన్‌పల్లిలోని పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయానికి దాత కాంగ్రెస్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి ఎల్ఈడీ లైట్లను అందజేశాడు. బుధవారం ఆలయ అర్చకుడు అచ్యుత్‌శర్మకు ఎల్ఈడీ లైట్లు అందజేశాడు. ఈ కార్యక్రమంలో శంకర్, వికాస్, రాజు, నవీన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# మొక్కుబడిగా 'సీఎం కప్'

- ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేక ఆటలకు దూరం
- క్రీడాకారులను ప్రోత్సహించడంలో పీడీల నిర్లక్ష్యం



వాలీబాల్ ఆడుతున్న డీఎల్‌పీఓ, అధికారులు

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలో సీఎం కప్ క్రీడలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. ఒక్కరోజులో ఆటలు పూర్తి కాగా రెండోరోజు ఆటలు లేకుండా పోయాయి. అధికారులు మూడు రోజుల ప్రణాళిక వేయగా, ఒక్కరోజుకే పరిమితమయ్యాయి. కౌడిపల్లి మండలంలో 29 గ్రామ పంచాయతీలున్నాయి. పది ఉన్నత పాఠశాలలు, 40 ప్రాథమిక పాఠశాలలు, రెండు గురుకులాలు, ఒక ఆశ్రమ పాఠశాల ఉంది. ఒక జూనియర్ కళాశాల, ఒక డిగ్రీ కళాశాల ఉంది. మొత్తం ఏడువేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. కాగా ప్రభుత్వం సీఎంకప్ గ్రామ స్థాయి, మండల స్థాయిలో పాల్గొనే క్రీడాకారులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని నిబంధన పెట్టింది. ఈ విషయాన్ని ప్రచారం లేకపోవడంలో కొందరు పీడీ, పీఈటీలు నిర్లక్ష్యం చేశారు. దీంతో క్రీడాకారులు ఆన్‌లైన్ ఎంట్రీ చేసుకోలేక సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే అవకాశం లేకుండా పోయింది. మండలంలోని తునికి గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో మంగళవారం డీఎల్‌పీఓ, ఇతర మండల అధికారులు సీఎం కప్ క్రీడలను ప్రారంభించగా, భుజిరంపేట, కూకుట్లపల్లి, వెల్మకన్న, తునికి హరిచంద్‌తండాకు చెందిన క్రీడాకారులు మాత్రమే కబడ్డీ, వాలిబాల్ పోటీల్లో పాల్గొన్నారు. ఒక్కరోజులోనే క్రీడలు అన్ని ముగిశాయి. బుధవారం క్రీడాకారులు లేక ఆటలు ఆడలేదు.

**కౌడిపల్లి నుంచి ఒక్కరూ లేరా..?**

మండల కేంద్రం కౌడిపల్లి పెద్ద పంచాయతీ. ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల ఉన్నాయి. కానీ సీఎం కప్ పోటీల్లో ఒక్కరూ కూడా రాలేదు. దీనికి కారణం పాఠశాల పీడీ (ఫిజికల్ డైరెక్టర్) సరిగ్గా స్పందించక పోవడం అని యువకులు అంటున్నారు. సీఎం కప్‌తో పాఠశాలకు సంబంధం లేని గ్రామస్తులే ఆన్‌లైన్ చేసుకొని ఆడాలని పీడీ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు విద్యార్థులు తెలిపారు. అదే భుజిరంపేట, వెల్మకన్న గ్రామాల నుంచి పీడీలు 30 మందికి పైగా బాలబాలికలను క్రీడాల్లో పాల్గొనేందుకు తీసుకొచ్చారు.

**ఆన్‌లైన్ నమోదుతో తంటాలు**

క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో విద్యార్థులు సీఎం కప్ పోటీల్లో ఆడలేకపోయారు. ఆన్‌లైన్‌లో వచ్చే లింక్‌లు క్లిక్‌చేస్తే ఎక్కడ సైబర్ వలలో చిక్కుకుంటామోనని మొబైల్ ఫోన్‌ల్లో ఎంట్రీ చేయలేదు. మీసేవా లేదా ఇతర ఆన్‌లైన్ కేంద్రాలకు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని, సమయం ఎక్కువ అవుతుందని అందుకే క్రీడలకు దూరంగా ఉన్నట్లు వారు చెపుతున్నారు. గతంతో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పాఠశాల బోనాఫైడ్‌తో పాల్గొనేవారు. వారంపాటు పోటీలు జరిగేవి. కాగా సీఎం కప్ క్రీడాపోటీలు మొక్కుబడిగా జరిగాయని విద్యార్థులు, యువకులు అంటున్నారు.

## రామాయంపేటలో జర్నలిస్టుల నిరసన



రామాయంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు



నర్సాపూర్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

**రామాయంపేట(మెదక్):** హైదరాబాద్‌లో జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ సినీ నటుడు మోహన్‌బాబును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రామాయంపేటలో జర్నలిస్టు సంఘాలు ఆందోళన చేశారు. టీయూడబ్ల్యూజే, ఐజేయూ సంఘాల జర్నలిస్టులు నల్లబాడ్జీలతో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐజేయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాసశర్మ, జర్నలిస్టు జేఏసీ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాము, జిల్లా సంయుక్త కార్యదర్శి నగేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, టీయుడబ్ల్యూజే మండలాధ్యక్షుడు యాదగిరి ఉన్నారు.

**నర్సాపూర్ రూరల్:** నర్సాపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణ నుంచి ఆర్డీఓ కార్యాలయం వద్దకు జర్నలిస్టులు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ మహిపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



మనోహరాబాద్‌లో పర్యటించిన సెంట్రల్ వైద్యుల టీం సభ్యులు

**మనోహరాబాద్(తూప్రాన్):** కుష్టువ్యాధి నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం సెంట్రల్ టీం మనోహరాబాద్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారితో కలిసి కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. శరీరంపైన తెల్లని, నొప్పిలేని మచ్చలు ఉంటే వెంటనే వైద్యులు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ టీం సభ్యులు హరికృష్ణ, బాలకృష్ణ, జాన్ బాబు, శ్రీనివాస్, వెంకటరమణ, పీహెచ్‌సీ వైద్యులు సమత, బాల్ నర్సయ్య ఉన్నారు.

## ప్రతీ ఇంట్లో భగవద్గీత ఉండాలి



బహుమతి అందజేస్తున్న అశోక్

**మెదక్ మున్సిపాలిటీ:** ప్రతి ఇంట్లో భగవద్గీత గ్రంథం ఉండాలని, తప్పనిసరిగా పఠించాలని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల కోశాధికారి అశోక్ విద్యార్థులకు తెలిపారు. బుధవారం మెదక్ పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో భగవద్గీత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహంకాళి మాట్లాడుతూ.. కృష్ణుడు అర్జునుడికి బోధించిన గీతా సారాంశాల్లో ముఖ్యంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు ఆనంద్‌రెడ్డి, సుధారాణి, చంద్రశేఖర్, సుజాత, అవంతి, సద్గుణ, వందనలతో పాటు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ప్రశాంతత



చిలప్‌చెడ్‌లో కబడ్డీ పోటీలకు టాస్ వేస్తున్న ఎంఈఓ విఠల్, ఎంపీడీఓ ఆనంద్, తదితరులు

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** విద్యార్థులు, యువకులు మైదానాల్లో క్రీడలు ఆడడంతో మానసిక, శారీరక ప్రశాంతత ఉంటుందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓతో కలిసి తహసీల్దార్ ముసాద్దిక్, మండల విద్యాధికారి విఠల్ సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**శివ్వంపేటలో..**

**శివ్వంపేట(నర్సాపూర్):** క్రీడా పోటీలు రెండోరోజు కొనసాగాయి. బుధవారం మండల పరిధిలోని గోమారం ఉన్నత పాఠశాల మైదానంలో ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. శివ్వంపేట యూత్ టీం ఖోఖోలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా, ఎంఈఓ బుచ్చనాయక్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు లావణ్యరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, బీసీ హాస్టల్ వార్డెన్ భాను సింగ్, మండలంలోని పీడీ, పీఈటీలు ఉన్నారు.

**కొనసాగుతున్న పోటీలు**

**పెద్దశంకరంపేట(మెదక్):** మండలంలో క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంఈఓ వెంకటేశం పర్యవేక్షించారు.



పెద్దశంకరంపేటలో..



శివ్వంపేట(నర్సాపూర్): ఖోఖోలో మొదటి స్థానం సాధించిన జట్టు

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మగ్గం వర్క్‌పై అవగాహన కల్పిస్తున్న సువర్చల

**నర్సాపూర్ రూరల్:** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని హ్యాండీక్రాఫ్ట్స్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల అన్నారు. బుధవారం నర్సాపూర్ కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్లో హ్యాండీక్రాఫ్ట్స్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు ఆట, పాట, ఆర్ట్, క్రాఫ్ట్, ఇతర రంగాల్లో రాణించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లోని అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. నర్సాపూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో రెండు రోజులపాటు అవగాహన కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కుట్టు, అల్లికలు, బొమ్మల తయారీ, మగ్గం వర్క్, పెయింటింగ్‌లో మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ చంచల్ పాల్, పాఠశాల డైరెక్టర్ ప్రదీప్, ప్రిన్సిపాల్ రేఖ, రామచందర్, సవిత తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**మెదక్ కలెక్టరేట్:** ఆరు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు, కార్మికులకు వేతనాలు విడుదల చేయకుంటే కార్మికులు వంటలు ఎలా చేస్తారని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి నర్సమ్మ అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలుగా మెనూ బిల్లులు, వేతనాలు మంజూరు చేయకుండా కార్మికుల ఎలా వంట చేస్తారని, వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికుల లక్ష్మి, బాలమణి, సుశీల, నర్సమ్మ, సంగీత, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

### వాహనం టైర్లు చోరీ

**కౌడిపల్లి(నర్సాపూర్):** బొలెరో గూడ్స్ వాహనం టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన కౌడిపల్లిలో చోటు చేసుకుంది. బుధవారం బాధితుడు పట్నం ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్టాండ్ దుకాణాల సముదాయంలో పండ్ల దుకాణం ఉంది. బొలెరో గూడ్స్ వాహనంలో పండ్లు తేవడంతో పాటు రోజువారి కిరాయిలకు వెళ్తుంటాను. మంగళవారం రాత్రి కౌడిపల్లి బస్టాండ్ ఆవరణలో దుకాణం ముందు వాహనాన్ని పార్క్ చేసి ఇంటికెళ్లాను. బుధవారం తెల్లవారుజామున చూసేసరికి రెండు టైర్లు డెస్కులతో సహా చోరీ అయ్యాయి. వీటి ఖరీదు సుమారుగా రూ.30 వేలవరకు ఉంటుందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి



కౌడిపల్లి(నర్సాపూర్): మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్



చిన్నశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న ఎంపీడీఓ దామోదర్

**కౌడిపల్లి(నర్సాపూర్):** ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లోని వన నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఐదు వేల మొక్కలు పెంచాలన్నారు. ప్రస్తుతం ఎర్ర మట్టి కవర్లలో నింపి విత్తనాలు నాటాలన్నారు. వచ్చే వర్షకాలం వరకు మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని తెలిపారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో గ్రామాలవారికి సర్వే పత్రాలు, ఆన్‌లైన్ ఎంట్రీల్లో తేడా లేకుండా సమానంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**నర్సరీలను సిద్ధం చేయండి**

**చిన్నశంకరంపేట(మెదక్):** ప్రతీ గ్రామంలో ఐదు వేల మొక్కలను పెంచేందుకు నర్సరీలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ దామదర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోఈజీఎస్ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి అవసరమైన మట్టిని, బ్యాగులను సిద్ధం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేకిగా మారిన ప్రభుత్వం

బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తిరుపతిరెడ్డి

**నిజాంపేట(మెదక్):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకిగా మారిందని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి కఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం మండల చౌకత్‌పల్లి తండాలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లి విగ్రహం బోసిపోయిందన్నారు. సీఎం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసగించారని తెలిపారు. రుణమాఫీ, ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ కార్యకర్తలు ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేయిస్తుందని, ఈ విషయమై ప్రజలు వారికి తగిన బుద్ధి చెపుతారన్నారు. తండాలో ఇటీవల మృతి చెందిన దూరి అనే మహిళ కుటుంబ సభ్యులను తిరుపతిరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో కల్వకుంట సహకార సంఘం చైర్మన్ కొండల్‌రెడ్డి, నార్లాపూర్ మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి దందా

మైనింగ్ అధికారులకు టాక్స్ చెల్లించకుండానే తరలింపు



మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

**చిన్నశంకరంపేట(మెదక్):** అక్రమంగా మట్టి రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గవ్వలపల్లి, అంబాజిపేట, కొర్విపల్లి గ్రామాల రైతులను మచ్చిగా చేసుకొని కొందరు పంటపొలాల నుంచి పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. మెట్రిక్ టన్నుకు ఇంతని మైనింగ్ శాఖ అధికారులు నిర్దేశించిన డబ్బులు చెల్లించి అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ తమకు ఇవేమి పట్టవన్నట్లుగా మట్టిని తరలిస్తున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని మండలంలోని పలువురు పేర్కొన్నారు. ఇదే విషయంపై చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్‌ను ప్రశ్నించగా సిబ్బంది కొరతతో రాత్రి సమయంలో తాము అందుబాటులో ఉండడం లేదన్నారు. దీంతోనే మట్టి అక్రమ రవాణా విషయం తమ దృష్టికి రావడంలేదన్నారు.

## అలరించిన భాషా ఉత్సవాలు



విద్యార్థులు వేసిన చిత్రాలతో ఉపాధ్యాయులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

**నర్సాపూర్:** భాషా ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాష ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు గీసిన చిత్రాల ను ప్రదర్శించి, విద్యార్థులతో పద్యాలు, గేయా లు చదివించారు. పాఠశాల హెచ్‌ఎం రాజప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**హవేళిఘణాపూర్(మెదక్):** మండల కేంద్రం హవేళిఘణాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో భారతీయ భాషా దినోత్సవాల సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. విద్యార్థులు స్టోరీ టెల్లింగ్, సాంప్రదాయ వస్త్రాలంకరణతో సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం కరుణాకర్ మాట్లాడుతూ.. తల్లి లాంటి తెలుగు భాషతో పాటుగా భారతీయ భాషలన్నింటిపై ప్రావీణ్యత సాధించాలన్నారు. విద్యతో పాటు విజ్ఞానం పొంది విజయశిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్యామల, దేవ్లా, రవీందర్, మహేశ్వరాచారీ, అశోక్, రాజేశం, ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.

## పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

మురికినీరు నిల్వతో దుర్వాసన, దోమల బెడద



ఇళ్ల మధ్య కందకంలో పెరిగిన పిచ్చిమొక్కలు

**శివ్వంపేట(నర్సాపూర్):** నివాసగృహల మధ్యలో ఉన్న విలువైన కందకం భూమి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో తీవ్ర దుర్వాసనతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం శివ్వంపేటలోని 6వ వార్డులో ఇళ్ల మధ్య ఉన్న కందకంలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలతో పాటు మురికినీరు నిల్వ ఉండడం వల్ల పారిశుద్ధ్య లోపంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.

**కందకం పూడ్చండి**

మండల కేంద్రంలో ప్రజాఅవసరాల నిమిత్తం ఏదైన భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వస్థలం లేక ఇబ్బందులు పడాల్సివస్తోంది. జిల్లా అధికారులు చొరవ చూపి, గ్రామంలోని కందకంను మట్టితో పూడ్చి చదును చేస్తే ఆ భూమి ప్రభుత్వ అధీనంలోకి తీసుకుంటే కోట్ల విలువ చేసే భూమి ప్రజాఅవసరాల కోసం ఉపయోగపడుతుంది. కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు ఎంతగానో దోహదపడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయం ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లగా.. గ్రామం చుట్టు ఉన్న కందకంను పరిశీలించి పూడ్చేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మట్టిని నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ భూమి అన్యాక్రాంతం కాకుండా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

## 'డివిజన్' ఏర్పాటుకు వినతి

**దుబ్బాక:** దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రం అందించారు. ఆ పార్టీ జిల్లా నేత భాస్కర్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కోసం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, నవీన, భాస్కర్, ఎల్లయ్య, సాజిద్, సాదిక్, ప్రశాంత్, శ్రీనివాస్, స్వామి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.